క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

కడ్తాల్: నిరుపేదలకు రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ అండగా ఉంటుందని ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన జంగయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులను దశరథ్‌నాయక్ మంగళవారం పరామర్శించి రూ.25వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వెంకటేశ్‌గుప్తా, మాజీ సర్పంచ్ లక్ష్మీనర్సింహా రెడ్డి, నాయకులు రామకృష్ణ, పాండు నాయక్, లాయక్ అలీ, నర్సింహ, కృష్ణ, అంజి, శ్రీను, మహేశ్, పాండు, సురేశ్, శ్రీకాంత్, రాజా, రాములు, శివ తదితరులు ఉన్నారు.

సాగులో సలహాలు పాటించాలి

మండల వ్యవసాయ అధికారి జ్యోతిశ్రీ

మంచాల: రైతులు సాగలో అధికారుల సలహాలు పాటించాలని మండల వ్యవసాయ అధికారి జ్యోతిశ్రీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో రైతులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతు భరోసా పథకం విధి విధానాలు ఏవిధంగా రూపొందించాలని రైతుల నుంచి సలహాలు తీసుకున్నార న్నారు. ఆయా విషయాలను మంత్రివర్గ ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లి నివేదిక తయారు చేస్తామన్నారని పేర్కొన్నారు. ఆరుద్ర కార్తెలో వ్యవసాయ పంటల సాగు విషయంపై వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయ ప్రతినిధి మల్లికార్జున్, ఏడీఏ వెంకటేశ్వర్లు, ఏఓలు సందీప్, సోల్మాన్ నాయక్, ఏఈఓలు సాయి సిరి, సరిత, లింగస్వామి, శ్రవణ్, రఘుపతి, లక్ష్మణ్, వసంత, గురు ప్రసాద్, నిఖిత, సంతోష్, రైతులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో బదిలీలు సహజం

ఎస్ఐ శ్రీకాంత్



తిరుపతిని సన్మానించిన సహోద్యోగులు

తలకొండపల్లి: విధి నిర్వహణలో బదిలీలు సహజమని ఎస్ఐ శ్రీకాంత్ అన్నారు. తలకొండపల్లి పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళుతున్న హెడ్ కానిస్టేబుల్ తిరుపతిని మంగళవారం ఆ స్టేషన్ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాలుగా ఇక్కడ తన విధులను సమర్థవంతంగా నిర్వర్తించడంతో పాటు మచ్చలేని వ్యక్తిగా తిరుపతికి పేరుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపడతాం: కార్పొరేటర్



కార్మికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాలలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలను పరిష్కరించేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనుల గురించి ఆయా కాలనీల ప్రతినిధులతో కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతానాయక్ మాట్లాడుతూ, డివిజన్ పరిధిలో పారిశుద్ధ్య సమస్య తీవ్రంగా ఉందని ప్రణాళికాబద్ధంగా సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం పట్టని ప్రభుత్వాలు

బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

ఆమనగల్లు: వచ్చే కేంద్ర బడ్జెట్‌ల బీసీల అభివృద్ధి కోసం రూ.2 లక్షల కోట్లు కేటాయించాలని బీసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు డా.బొల్లు మహేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆమనగల్లులో మాట్లాడుడారు. బీసీల అభివృద్ధిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విస్మరించాయన్నారు. బీసీల విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక అభివృద్ధి కోసం ప్రభుత్వాలు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం బీసీల జనాభాకు అనుగుణంగా వారి అభివృద్ధికి బడ్జెట్ కేటాయించకుండా ఇన్నేళ్లుగా అన్యాయం చేస్తోందని ఆరోపించారు. రానున్న బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి పెద్దమొత్తంలో బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు.

కాలినడకే శరణ్యం

మహాలక్ష్మి పథకం ద్వారా రాష్ట్రం అంతటా మహిళలు, బాలికలు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ద్వారా లబ్ధిపొందుతున్నప్పటికీ ఇక్కడి మహిళలు, విద్యార్థులకు మాత్రం ఆ లబ్ధి పొందేందుకు ఇబ్బంది పడతున్నారు. పాఠశాలల సమయానికి అనుకూలంగా బస్సులు సర్వీసులు లేకపోవడంతో విద్యార్థులు కిలోమీటర్ల మేర నడిచివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కాలినడక కోసమే ఎక్కువ సమయం అవుతుండటంతో చదువుపై శ్రద్ధ పెట్టలేని పరిస్థితి. ఈవిషయమై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఆర్టీసీ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

- పాఠశాలల సమయానికి అనుకూలంగా నడవని ఆర్టీసీ బస్సులు
- కిలోమీటర్ల మేర నడిచి వెళ్తున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు



మల్కీజ్‌గూడ నుంచి నక్కర్తమేడిపల్లి పాఠశాలకు కాలినడకన వెళ్తున్న విద్యార్థినులు

యాచారం: యాచారం మండలంలో 24 గ్రామాలు ఉండగా.. పది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలలు ఉన్న గ్రామాలు మినహా మిగితా 14 గ్రామాల నుంచి విద్యార్థులు నిత్యం చదువుకోడానికి వస్తారు. నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలకు.. మల్కీజ్‌గూడ, నానక్‌నగర్, పల్లెచల్కతండా, చింతపట్ల ఉన్నత పాఠశాలకు.. తమ్మలోనిగూడ, తక్కళ్లపల్లితండా, మాల్ ఉన్నత పాఠశాలకు.. మంతన్‌గౌరెల్లి, కిషన్‌పల్లి, యాచారం ఉన్నత పాఠశాలకు.. చౌదర్‌పల్లి, మొండిగౌరెల్లి, చింతుల్ల ఉన్నత పాఠశాలకు.. ధర్మన్నగూడెం, భాషమోనిగూడెం, గునుగల్ ఉన్నత పాఠశాలకు.. గడ్డ మల్లయ్యగూడ, కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు.. తక్కళ్లపల్లి, కొత్తపల్లి తండా, కుర్మిద్ద ఉన్నత పాఠశాలకు.. కుర్మిద్ద తండా, మర్లకుంట తండా ఇలా పలు గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలకు చుట్టుపక్కల ఉన్న గ్రామాల విద్యార్థులు నిత్యం చదువుకోవడానికి వస్తారు.

కిలోమీటర్ల మేర..

ఆయా గ్రామాల్లో ఉన్నత పాఠశాలలకు వెళ్లేందుకు ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. యాచారం నుంచి పల్లెచల్కతండా, తాడిపర్తి రూట్లో, యాచారం నుంచి చింతుల్ల రూట్లో, మాల్ నుంచి మంతన్‌గౌరెల్లి రూట్లో, కొత్తపల్లి నుంచి తక్కళ్లపల్లి రూట్లో, యాచారం నుంచి నందివనపర్తి, నస్దిక్‌సింగారం రూట్లో, యాచారం నుంచి మొండిగౌరెల్లి రూట్లో.. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సు సర్వీసులను నడపడంలో అధికారులు శ్రద్ధ పెట్టడంలేదనే విమర్శలు ఉన్నాయి. యాచారం ఆర్టీసీ బస్టాండ్ నుంచి సాయంత్రం 6 తర్వాత మెజార్టీ గ్రామాలకు బస్సు సర్వీసులు నడువుతుండటంతో విద్యార్థులు అప్పటి వరకు బస్టాండ్‌లోనే ఉండి రాత్రికి ఇంటికి చేరుకుంటున్నారు. కొన్నిసార్లు ఆ బస్సులను కూడా రాకపోవడంతో ఏం చేయాలో తోచని స్థితిలో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. చార్జీలకు డబ్బులున్న వారికి ఇబ్బంది లేకపోయినప్పటికీ.. కేవలం బస్‌పాస్ కలిగిఉన్న, ఉచిత బస్సు ప్రయాణాన్నే నమ్ముకున్న విద్యార్థినుల పరిస్థితి వర్ణణాతీతం.

ఉచిత ప్రయాణ సౌకర్యం ఉన్నా..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ అవకాశం కల్పించింది. అయితే గ్రామాలకు బస్సులు సకాలంలో రాకపోవడంతో ఆ అవకాశాన్ని విద్యార్థినులు ఉపయోగించుకోలేకపోతున్నారు. యాచారం–కందుకూర్, యాచారం–మాల్, మాల్–మంతన్‌గౌరెల్లి రూట్లో అదనపు బస్సు సర్వీసులు లేకపోవడంతో తీవ్ర రద్దీ నెలకొంది. ఉన్న బస్సుల్లో మహిళలు, విద్యార్థినులకే చోటు సరిపోకపోవడంతో విద్యార్థులు, పురుషులు ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ఐదు కిలోమీటర్ల నడక



నాది మల్కీజ్‌గూడ గ్రామం. నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలలో ఆరోతరగతి చదువుతున్నాను. పాఠశాలకు వెళ్లివచ్చేందుకు సమయానికి బస్సు సర్వీసులు లేకపోవడంతో కాలినడకనే పోతున్నాం. నిత్యం ఐదు కిలోమీటర్ల మేర నడుస్తున్నాం. పాఠశాల నుంచి ఇంటికి వచ్చేసరికి అలిసిపోతున్నాం. చదువుపై శ్రద్ధ పెట్టలేకపోతున్నాం. బడుల సమయానికి అనుకూలంగా బస్సు సర్వీసులను నడపాలి.

– సింధు, విద్యార్థిని, మల్కీజ్‌గూడ

సమయానికి బస్సులు నడపాలి



పాఠశాలల సమయాలకు అనుకూలంగా ఉదయం, సాయంత్రం పూట అదనపు బస్సులు నడిపించాలని పలుమార్లు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఒక్కోసారి నక్కర్తమేడిపల్లి నుంచి పల్లెచల్కతండా మధ్యన బస్సు సర్వీసులను చివరి నిమిషంలో క్యాన్సిల్ చేస్తుండటంతో రాత్రివరకు విద్యార్థులు ఇంటికి వెళ్లలేకపోతున్నారు. తక్కళ్లపల్లి నుంచి కొత్తపల్లి ఉన్నత పాఠశాలకు వెళ్లే విద్యార్థులు కూడా బస్సు సర్వీసు లేకపోవడంతో కాలినడకనే వెళ్తున్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలి.

– రవీందర్‌గుప్తా, నక్కర్తమేడిపల్లి

సంధ్య చదువు బాధ్యత నాదే

నిరుపేద విద్యార్థినికి అండగా ఉప్పల ట్రస్టు చైర్మన్ వెంకటేశ్



సంధ్యకు అడ్మిషన్ పత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: ఓ నిరుపేద విద్యార్థిని చదువుకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు అండగా నిలిచింది. మాడ్గుల మండలం కొల్కులపల్లికి చెందిన తోడేటి సంధ్య.. ఇటీవల తన తల్లి మృతిచెందడంతో ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని జంగారెడ్డిపల్లిలో అమ్మమ్మ ఈదమ్మ ఇంట్లో ఉంటోంది. అయితే సంధ్య చదువు కొనసాగించడానికి ఆర్థికంగా ఇబ్బందిగా ఉండటంతో ఈదమ్మ తలకొండపల్లి జెడ్పీటీసీ సభ్యుడు, ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌ను సాయం కోసం అభ్యర్థించింది. వెంటనే స్పందించిన వెంకటేశ్.. సంధ్యను ఆమనగల్లు పట్టణంలోని ప్రజ్ఞ ఉన్నత పాఠశాలలో సొంత ఖర్చుతో 9వ తరగతిలో చేర్పించారు. భవిష్యత్‌లో కూడా సంధ్య చదువుకు అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోపాల్‌నాయక్, బుచ్చిబాబు తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



కడ్తాల్: విద్యార్థులకు స్టేషనరీ సామగ్రి అందజేస్తున్న దాతలు

కడ్తాల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని యువజన నాయకులు తేజ, రాఘవేందర్, జయరాం అన్నారు. మండల పరిధిలోని కర్కల్‌పహాడ్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు.. విద్యార్థులకు నోట్ బుక్స్, స్టేషనరీ సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

దాతలు సహకరించాలి..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు దాతలు సహకరించాలని ఎల్మినేడు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు జయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఎల్మినేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 70 మందికి, హరిజనవాడలోని 40 మంది విద్యార్థులకు.. షూ. సాక్స్, టై, బెల్ట్‌లను ఆమె అందజేశారు. విద్యార్థులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రమణ, ఉపాధ్యాయులు.. రమ్య, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడతున్న మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది

- జల్‌పల్లి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది
- జనరల్ బాడీ సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చ

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల మరమ్మతులను త్వరితగతిన చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ అబ్దుల్లా సాది అధికారులను ఆదేశించారు. ఆయా పనులకు సంబంధించి నిధులు కూడా మంజూరు చేశామన్నారు. చైర్మన్ సాది అధ్యక్షతన మంగళవారం జల్‌పల్లి మున్సిపాలిటీ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీ నిర్వహణ, బోనాలు, వినాయక చవితి పండుగలకు సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రతిపాదనలకు పాలకవర్గం సభ్యులు ఆమోదం తెలిపారు. ఇంజనీరింగ్ విభాగం, అవుట్ సోర్సింగ్ సిబ్బంది నియామకం, వాటర్‌మెన్, విద్యుత్ దీపాల ఏర్పాటు తదితర వాటి కోసం మొత్తం రూ.64 లక్షల నిధులను కేటాయించారు. ఇందులో ప్రధానంగా మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ల నిర్మాణం, ఎర్రకుంట, జేజీఆర్ గార్డెన్ వద్ద మరమ్మతుల కోసం రూ.20.30 లక్షలు కేటాయించారు. మ్యాన్‌హోళ్ల మరమ్మతులు, నూతన మ్యాన్‌హోళ్ల కొనుగోలుకు సంబంధించి రూ.33 లక్షలు కేటాయించారు. ఎలక్ట్రీషియన్ పనుల కోసం రూ.10 లక్షలు, గణేష్ నిమజ్జనం కోసం రూ.5 లక్షల చొప్పున బడ్జెట్ కేటాయించారు. చైర్మన్ మాట్లాడుతూ....మున్సిపాలిటీలో డ్రైనేజీ, రోడ్ల మరమ్మతుల సమస్య తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నామన్నారు. ఇందుకోసం అవసరమైన నిధులను కూడా సిద్ధంగా ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వాణి రెడ్డి, వైస్ చైర్మన్ ఫర్హానా నాజ్, కోఆప్షన్ సభ్యుడు కృష్ణారెడ్డి, ఉస్మాన్ షరీఫ్, కౌన్సిలర్లు యాదగిరి, లక్ష్మీనారాయణ, శంకర్, కసాది, శంషుద్దీన్, మజహర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్‌కు సహకరించాలి: ఏబీవీపీ

ఆమనగల్లు: ప్రభుత్వ బడుల్లో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలనే డిమాండ్‌తో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ నగర కార్యదర్శి శివ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బంద్‌కు అన్ని పాఠశాలల యాజమాన్యాలు సహకరించాలని ఆయన కోరారు.

టీఎస్‌ఎస్ఓ చరికొండ కమిటీ ఎన్నిక

కడ్తాల్: టీఎస్ఎస్ఓ మండల అధ్యక్షుడు రేవంత్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ సంఘం చరికొండ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ గ్రామ అధ్యక్షుడిగా రాహుల్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా ప్రవీణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా భానుప్రసాద్, సహాయ కార్యదర్శిగా శేఖర్‌గౌడ్, గ్రామ కన్వీనర్‌గా నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా శివ, యు.శివ, సాయికిరణ్, అనిల్, సాయి, తరుణ్‌ను ఎన్నుకున్నారు. రాహుల్‌గౌడ్ మాట్లాడుతూ.. తన నియామకానికి కృషి చేసిన టీఎస్ఎస్ఓ మండల అధ్యక్షుడు రేవంత్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికై పోరాడుతానని ఆయన అన్నారు.

కొనసాగుతున్న పనులు

యాచారం: మండల పరిధిలోని మొండిగౌరెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం కూడా మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. పాఠశాలలోని గోడలకు కిటికీలు, తలుపులు, మరుగుదొడ్లు, మూత్రశాలల మరమ్మతులు, విద్యుత్ లైన్, తరగతి గదుల్లో ఫ్యాన్లు ఏర్పాటు చేయిస్తున్నారు. అదే విధంగా పాఠశాలకు రంగులు కూడ వేయిస్తున్నారు. ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ రూ. 3.20 లక్షల నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతున్నారని పాఠశాల హెచ్‌ఎం జగదీశ్ తెలిపారు.

కాల్వ ఇలా.. నీరుపోయేదెలా?

- పూడుకుపోయిన సర్వీస్ రోడ్డు వరదకాల్వలు
- పట్టించుకోని ఔటర్ నిర్వహణ అధికారులు



ఔటర్ సర్వీస్ రోడ్డులో పూడుకుపోయిన కాలువ

తుక్కుగూడ: ఔటర్ సర్వీస్ రింగు రోడ్డుకు ఇరు వైపులా వర్షపునీరు పోవడానికి వరద కాల్వలు ఏర్పాటు చేశారు. కానీ కాల్వల నిర్వహణ సరిగా లేకపోవడంతో కొద్దిరోజుల నుంచి పూడుకుపోయాయి. ప్రస్తుతం కాల్వల్లో మట్టి, చెత్త చెదారం నిండి, గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి పూర్తిగా ఆనవాలు కనిపించడం లేదు. దీంతో వర్షపునీరు ప్రవాహానికి తీవ్ర ఇబ్బందులు తలెత్తుతోంది. వర్షపునీరు సర్వీస్ రోడ్డుపైకి రావడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. నీరు ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో మురుగు నీరుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. ఔటర్ నిర్వహణ అధికారులు స్పందించి వరద కాల్వలకు మరమ్మతులు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేడు అవగాహన ర్యాలీ

మహేశ్వరం: మండల కేంద్రంలో బుధవారం ఉదయం 9:30 గంటలకు అంబేడ్కర్ విగ్రహం నుంచి మహేశ్వరం చౌరస్తా వరకు మహేశ్వరం పోలీస్‌ల ఆధ్వర్యంలో డ్రగ్స్, గంజాయి వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని సీఐ వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి యువకులు, ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, విద్యార్థులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐ కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశమై నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని డ్రైయిన్లలో పేరుకుపోయిన పూడిక మట్టిని వెలికి తీయించాలని సూచించారు. కొన్ని రోజుల క్రితం జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ జియాఉద్దీన్ ను కలిసి నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలను వారికి వివరించామని ఎమ్మెల్యే తెలిపారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకొని పనులు చేపట్టాలని సూచించారు. గతంలో నిర్మించిన ఎస్ఎన్‌డీపీ, బాక్స్ డ్రెయిన్, ట్రంక్ లైన్స్ నిర్మాణ పనులు సత్ఫలితాలను ఇచ్చాయన్నారు. సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రమేష్ బాబు,దామోదర్ రెడ్డి,చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం

ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామకృష్ణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బలరామకృష్ణ

తలకొండపల్లి: మానవ అక్రమ రవాణాను అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందని ప్రజ్వల సంస్థ ప్రాజెక్టు మేనేజర్ బలరామ కృష్ణ పిలుపునిచ్చారు. హైదరాబాద్ ప్రజ్వల సంస్థ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో.. మానవ అక్రమ రవాణను అరికట్టడం ఎలా అనే అంశంపై పొదుపు సంఘం మహిళలకు ఇస్తున్న శిక్షణ కార్యక్రమం రెండోరోజు(మంగళవారం) కొనసాగింది. లఘు చిత్రాలు, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, గ్రూప్ డిస్కస్ ద్వారా మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీసీలు లక్ష్మయ్య, రామయ్య, సుధారాణి, చెన్నయ్య, ప్రజ్వల సిబ్బంది.. సురేష్ కుమార్, అనిల్, అంబర్ సింగ్, మిథాలీరాజ్, అనిల్ కుమార్, వీఓఏలు.. నర్సింహ, కల్పన, బాగ్యలక్ష్మి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు అందించేందుకు కృషి: డిప్యూటీ మేయర్



వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

బడంగ్‌పేట్: మిషన్ భగీరథ నీటిని ప్రజలకు అందించేందుకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అహర్నిషలు కష్టపడుతున్నారని బడంగ్‌పేట కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్ అన్నారు. మంగళవారం కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం గృహ సముదాయాలలో నివాసం ఉంటున్న పేద ప్రజలకు మిషన్ భగీరథ కింద మంచినీటిని అందించేందుకు నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, బీఆర్ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి కార్పొరేటర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇబ్రాం శేఖర్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఇంటింటికీ తాగునీరు అందించాలన్న లక్ష్యంతో సబితారెడ్డి ప్రత్యేక నిధులు తీసుకొచ్చి వాటర్ ట్యాంకులు నిర్మించారన్నారు. ఈ నెల 21న జలమండలి అధికారులతో రివ్యూ నిర్వహించి నిర్మాణ పనులు, వాటర్ పైప్‌లైన్లు వేయించి తాగునీటిని జిన్నారం(జేఎన్ఎన్‌యూఆర్ఎం) ప్రజలకు అందించేందుకు ఎమ్మెల్యే కృషి చేశారని పేర్కొన్నారు. అందరి అవసరాలు తీరుస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డికి అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ అర్జున్, కార్పొరేటర్లు రోహిణి రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, బోయపల్లి శేఖర్ రెడ్డి, చుక్క శివకుమార్ నాయకులు ఉన్నారు.

6 నుంచి వారాహీ దేవీ నవరాత్రులు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాల పీఠంలో గల ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో శ్రీ వారాహి దేవి నవరాత్రులు జూలై 6 నుంచి 14 వరకు ఘనంగా నిర్వహిస్తామని ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఆలయంలో వారాహి సమేత ప్రత్యంగిరా నవరాత్రుల కరపత్రాన్ని భక్తుల సమక్షంలో ఆవిష్కరించారు. నవరాత్రుల్లో ప్రతిరోజూ ఉదయం విశేష అభిషేకం, మహిళలచే కుంకుమార్చన, సాయంత్రం లలితా, విష్ణు, సౌందర్యలహరి, హనుమాన్ చాలీసా పారాయణం, రాత్రి సమయంలో మహా నక్షత్ర హారతి నిర్వహిస్తామన్నారు. జూలై 10న సాయంత్రం లక్ష బిల్వార్చన, 12న లక్ష పుష్పార్చన జరుగుతాయన్నారు. మరిన్ని వివరాలకు సెల్ 8977788066 లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో విట్టల్ శర్మ, సాయి కుమార్ శర్మ , అరుణ, హేమ, విజయలక్ష్మి, సుగుణ, భవాని, అవనిక పాల్గొన్నారు



వారాహి దేవి నవరాత్రుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మునిపల్లె శ్రీనివాస్ తదితరులు